సాక్షి జగిత్యాల

ఆదివారం । 17 । డిసెంబర్ । 2023



బీఆర్ఎస్ అవినీతిపై పోరాడండి

కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని చొప్పదండి, సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలు, స్థానిక సంస్థల్లో బీఆర్ఎస్ అవినీతిపై పోరాడాలని ఎంపీ సంజయ్ అన్నారు. 8లో▸



ఆడారు..అదరగొట్టారు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): చదువుకోవడమే కాదు.. ఆటల్లోనూ సత్తాచాటారు గిరిజన గురుకులం విద్యార్థులు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
27.0/16.0

వాతావరణం పొడిగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. సాయంత్రం, రాత్రివేళ చలిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

'నాన్న ఆరోగ్యం బాగుందా'



ఎమ్మెల్సీ కవిత, జీవన్‌రెడ్డి

జగిత్యాల: శాసనమండలి సమావేశం ప్రారంభానికి ముందు చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కార్యాలయంలో కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కలుసుకున్నారు. కేసీఆర్ ఆరోగ్యంపై కవితను అడిగి తెలుసుకున్నారు.

పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటాం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ



మాట్లాడుతున్న సత్యనారాయణ

మెట్‌పల్లి: నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోరపల్లి సత్యనారాయణ తెలిపారు. పట్టణంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీదే నైతిక విజయమని, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేశాయని, బీజేపీ మాత్రం నిజాయితీగా ప్రచారం చేసి 61వేలకు పైగా ఓట్లు సాధించిందని గుర్తు చేశారు. ఆదివారం మెట్‌పల్లిలో జరిగే నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఎంపీ పాల్గొంటారని, పార్టీ అభిమానులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి చెట్లపల్లి సుఖేందర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు రామన్నపేట విద్యార్థిని



శ్రీలత

మల్యాల: మండలంలోని రామన్నపేట జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని సంకుర్తి శ్రీలత రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రాజగోవింద రెడ్డి, పీఈటీ ములుక విద్యాసాగర్ తెలిపారు. ఈనెల 15న పెద్దపల్లి జిల్లాలో నిర్వహించిన ఎస్జీఎఫ్ అండర్–14 బాలికల విభాగంలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. సర్పంచ్ గడ్డం జలజ, ఎస్ఎంసీ చైర్మన్ రవీందర్, ఎంపీటీసీ సఫియాబేగం, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

18 నుంచి ఎస్సారెస్పీ నీటి విడుదల


- ఆన్, ఆఫ్ పద్ధతిలో ఆయకట్టుకు..



శ్రీరాం సాగర్ ప్రాజెక్టు

జగిత్యాలఅగ్రికల్చర్:యాసంగి సీజన్‌కుగాను ఎస్సారెస్పీ నుంచి నీటిని విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాజెక్టు అధికారులతో సమావేశమై ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ నెల 18 నుంచి ఆన్, ఆఫ్ పద్ధతిలో సాగునీరు ఇవ్వనున్నారు. మొదటి ఏడు రోజులు డిస్ట్రిబ్యూటరీ 53(జోన్–1) వరకు, తర్వాతి ఎనిమిది రోజులు లోయర్ మానేర్ ఎగువ భాగం వరకు నీరు ఇవ్వనున్నారు. ఎస్సారెస్పీ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులకుగాను ప్రస్తుతం 1088.60 అడుగులుగా ఉంది. ప్రతిరోజూ 405 క్యూసెక్కుల నీరు ఆవిరవుతుంది. ప్రాజెక్టు నుంచి మిషన్ భగీరథ కింద 152 క్యూసెక్కులు వదులుతున్నారు. సరస్వతి కాలువకు 50 క్యూసెక్కులు వదులుతున్నారు.

ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం



స్వామివారలకు పూజలు చేస్తున్న అర్చకులు

ధర్మపురి:ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శనివారం ధనుర్మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి జనవరి 14 వరకు ప్రతిరోజు ఉదయం మూడు గంటలకు గోదావరి జలాలను తీసుకొచ్చి స్వామివార్లకు అభిషేకం చేస్తారు. ఉదయం నాలుగు నుంచి 5.30 గంటల వరకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నైవేద్య సమర్పణ ఉంటుంది. ఉదయం నాలుగు నుంచి మధ్యాహ్నం 2.30, సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు ఆలయం తెరిచి ఉంటుందని ఈవో తెలిపారు.

చలికి గజగజ

- సంక్షేమ హాస్టళ్లలో వసతులు కరువు
- పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- చన్నీళ్లే దిక్కు దుప్పట్లు కరువు
- గీజర్లు ఉన్నా వృథానే
- కప్పుకోవడానికి బెడ్‌షీట్లు లేవు
- విద్యార్థుల అవస్థలు

జగిత్యాల: సంక్షేమ, గురుకుల హాస్టళ్ల విద్యార్థులు చలికి వణుకుతున్నారు. రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోవడం.. కొన్ని హాస్టళ్లలో సౌకర్యాలు లేకపోవడం.. కనీసం స్వెట్టర్లు లేకపోవడంతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. కొన్నిహాస్టళ్లలో గీజర్లు ఉన్నా పనిచేయకపోవడంతో చన్నీళ్లతో స్నానం చేస్తున్నారు. గతంలో వచ్చిన దుప్పట్లను విద్యార్థులకు అందించారు. కొందరు పాత దుప్పట్లను తీసుకోలేక ఇంటి నుంచి తెచ్చి కప్పుకుంటున్నారు. శుక్రవారం రాత్రి సాక్షి హాస్టళ్లను విజిట్ చేయగా అనేక అంశాలు వెలుగుచూశాయి.



జిల్లాకేంద్రంలోని వసతిగృహంలో నిద్రిస్తున్న విద్యార్థులు

నిరుపయోగంగా గీజర్

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం పొలాసలోని బీసీ వసతి గృహంలో 47 మంది విద్యార్థులు ఉన్నారు. వారికోసం ఏర్పాటు చేసిన గీజర్ పనిచేయడం లేదు. వసతి గృహం సమీపంలో త్రీఫేస్ విద్యుత్ సరఫరా లేకపోవడమే కారణమని పిల్లలు చెబుతున్నారు. విద్యార్థులు నీరు వేడి చేసుకుని స్నానం చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. వసతి గృహానికి డోర్లు, కిటికీలు, ఇతర వసతులు బాగున్నాయి.



జగిత్యాలలో నిరుపయోగంగా మారిన గీజర్

కేజీబీవీలో దుప్పట్ల కొరత

కథలాపూర్:మండలకేంద్రంలోని కేజీబీవీలో ఆరోతరగతి నుంచి పదోతరగతి వరకు 210 మంది విద్యార్థినులు ఉన్నారు. రెండేళ్లుగా దుప్పట్లు, బెడ్‌షీట్లు సరఫరా చేయకపోవడంతో ఇళ్లనుంచి తెచ్చుకున్నారు. మరికొందరు పూర్వ విద్యార్థులు ఇచ్చిన వాటితో నెట్టుకొస్తున్నారు. ఇటీవల చలి తీవ్రత ఎక్కువగా ఉండటం.. దుప్పట్లు సరిగా లేకపోవడంతో గజగజవణుకుతున్నామని విద్యార్థినులు తెలిపారు.



ఇంటి నుంచి తెచ్చుకున్న దుప్పట్లతో విద్యార్థినులు

అందని దుప్పట్లు

పెగడపల్లి: మండలకేంద్రంలో బీసీ, ఎస్సీ బాలుర వసతి గృహాలు అద్దె ఇళ్లలో కొనసాగుతున్నాయి. బీసీ హాస్టల్‌లో 29మంది ఉన్నారు. వీరికి దుప్పట్లు అందించకపోవడంతో చలి తట్టుకోలేక కొందరు విద్యార్థులు రాత్రి సమయంలో వారివారి ఇళ్లకు వెళ్తున్నారు. మరికొందరు ఇంటినుంచి దుప్పట్లు తెచ్చుకున్నారు. పడక మంచాలు లేవు. విషపురుగుల భయం ఉందని పిల్లలు చెప్పారు. గీజర్ లేక చన్నీటితోనే స్నానం చేస్తున్నామన్నారు.



పెగడపల్లిలో ఇంటినుంచి తెచ్చుకున్న బెడ్‌షీట్లను కప్పుకుని నిద్రిస్తున్న విద్యార్థులు

ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్స్	:15
ఉండాల్సిన విద్యార్థులు	:1500
ప్రస్తుతమున్న విద్యార్థులు	: 730
బీసీ వెల్ఫేర్ హాస్టళ్లు	9
ఉండాల్సిన విద్యార్థులు	1500
ప్రస్తుతమున్న విద్యార్థులు	500
పూలే రెసిడెన్షియల్ హాస్టళ్లు	5
ప్రతి హాస్టల్‌కు ఉండాల్సిన విద్యార్థులు	480
ప్రస్తుతమున్న విద్యార్థులు	250
మైనార్టీ రెసిడెన్షియల్ గురుకులాలు	7
ప్రతి హాస్టల్‌కు ఉండాల్సిన విద్యార్థులు	500
ప్రస్తుతం అన్ని హాస్టళ్లలో ఉన్న విద్యార్థులు	: 3000

దుప్పట్లు అందించాలి



అందరం పేదవారమే. దుప్పట్లు లేక చలికి వణుకుతున్నం. దుప్పట్లు లేవని సార్లకు చెప్పినా స్పందనలేదు. మాకు సరిపడా దుప్పట్లు అందించాలి.

– జి.లావణ్య

వాటర్‌హీటర్ పెట్టాలి



వసతి గృహంలో వాటర్‌హీటర్లు లేవు. చల్లని నీటితోనే స్నానం చేయాల్సి వస్తోంది. రెండు రోజులుగా చలి తీవ్రత పెరిగింది. ఉదయం స్నానం చేయాలంటేనే భయ మేస్తుంది. వేడి నీటి కోసం హీటర్లు అమర్చాలి.

– తోట కిరణ్, పదోతరగతి

గదులు బాగున్నాయి



హాస్టల్ గదులన్నీ బాగున్నాయి. కిటికీలకు అద్దాలు, తలుపులు ఉన్నాయి. విద్యార్థులందరం ఒకేచోట పడుకుంటున్నాం. దుప్పట్లు సరిపడా ఉన్నాయి. ఫ్యాన్లు వేసుకుంటున్నాం. చలి పెట్టడం లేదు.

– జయదీప్, పదో తరగతి

వసతులు మెరుగు



సారంగాపూర్: మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహంలో 58 మంది అడ్మిషన్లు పొందారు. వారందరికీ వసతులు అమలవుతున్నాయి. గీజర్లు కూడా పనిచేస్తున్నాయి. రగ్గులు, స్వెట్టర్లు, మంకీక్యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. తమకు ఎలాంటి ఇబ్బందీ లేదని విద్యార్థులు తెలిపారు.



అద్దె భవనమైనా అన్ని సౌకర్యాలు

కోరుట్ల: పట్టణ శివారు కల్లూర్ రోడ్డులో బీసీ వెల్ఫేర్ హాస్టల్ అద్దె భవనం అయినా కిటికీలు, తలుపులు బాగానే ఉన్నాయి. విద్యార్థులకు సరిపడా దుప్పట్లు అందుబాటులో ఉన్నాయి.

చన్నీళ్లే దిక్కు

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఎస్సీ, బీసీ బాలుర హాస్టళ్లలో గీజర్‌లు ఉన్నా త్రీఫేజ్ కరెంట్ లేకపోవడంతో పిల్లలకు చన్నీళ్లే దిక్కవుతున్నాయి. బీసీ హాస్టల్‌లో 50 మంది, ఎస్సీ హాస్టల్‌లో 57 మంది ఉన్నారు. విద్యార్థులకు సరిపడా దుప్పట్లు ఉన్నాయి. హాస్టళ్లకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేయాలని వార్డెన్లు బన్సినాయక్, పెద్దులు విద్యుత్ అధికారులకు విన్నవించారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి బీసీ, ఎస్సీ బాలుర హాస్టళ్లకు వచ్చే దారి రాత్రిపూట చీకటిగా ఉండడంతో భయపడుతున్నామని విద్యార్థులు తెలిపారు.



పాత దుప్పట్లతో విద్యార్థులు

మల్యాల: మండల కేంద్రంలోని వసతిగృహంలోని విద్యార్థులకు గతేడాది ఇచ్చిన దుప్పట్లే దిక్కయ్యాయి. చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పాత దుప్పట్లు అందించారు. స్వెట్టర్లు, మంకీక్యాంపులు పంపిణీ చేశారు. విశాలమైన గదుల్లో విద్యార్థులు పడుకునేందుకు పడకలతోపాటు శుద్ధి చేసిన నీటి ప్లాంటు సైతం అందుబాటులో ఉంది.

అందరికీ అందని దుప్పట్లు



ధర్మపురి: ధర్మపురిలోని కస్తూరిబా గురుకుల పాఠశాలలో 167 మంది విద్యార్థినులు ఉన్నారు. దుప్పట్లు అందించకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. గతేడాది వాడిన బ్లాంకెట్లను కొందరు వాడుతుండగా.. మరికొందరు ఇంటినుంచి తెచ్చుకున్న బ్లాంకెట్లను వాడుకుంటున్నారు. అలాగే పట్టణంలో ఎస్సీ, ఎస్టీ, బీసీవసతి గృహాలను ఒకే భవనంలో నిర్వహిస్తున్నారు. వీరిలో బీసీ విద్యార్థులకు దుప్పట్లు అందించలేదు. 125 లీటర్ల కెపాసిటీ గల గీజర్‌తో వేడి నీటిని అందిస్తున్నారు. చలి రాకుండా కిటికిలు, తలుపులకు మరమ్మతు చేశామని వార్డెన్ సుధాకర్ తెలిపారు.

చిరిగిపోయిన పరుపులు



బుగ్గారం: మండలకేంద్రంలోని వసతి గృహంలో పరుపులు చిరిగిపోయాయి. ఇటీవల దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ వసతి గృహంలో మొత్తం 21 మందికిగాను 10మంది హాస్టల్‌లో ఉన్నారు. ఇక్కడ ఇన్‌చార్జి వార్డెన్ ఉన్నారు. హాస్టల్ కోసం మొదటి అంతస్తులో మూడు గదులు కేటాయించగా మిగిలిన గదులతో గ్రౌండ్‌ఫ్లోర్‌లో తహసీల్దార్ కార్యాలయం కొనసాగుతోంది.

మలిసంధ్యలోనూ.. మేముసైతం

- సమాజహితంలో రిటైర్డ్ ఉద్యోగులు
- పెన్షన్ నుంచి కొంత మొత్తం వెచ్చింపు
- జిల్లాలో ఎనిమిది వేల మంది
- ఆదాయపన్ను రద్దు కోసం పోరాటం
- నేడు 41వ జాతీయ పెన్షనర్ల దినోత్సవం



సమస్యల పరిష్కారం కోసం ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న పెన్షనర్లు

జగిత్యాల:ప్రభుత్వ ఉద్యోగులుగా సుదీర్ఘకాలం సేవలందించిన ఫలితమో.. లేక సమాజహితంలో తాము కూడా భాగస్వాములం కావాలనే ఉద్దేశమోగానీ.. ఉద్యోగ విరమణ పొందిన కొందరు పెన్షన్‌దారులు ప్రజాసేవను ఎంచుకుంటున్నారు. ఇంటికే పరిమితం కాకుండా సేవల్లో మునిగితేలుతున్నారు. అయితే గతంలో వీరికి పెన్షన్ వచ్చేదికాదు. భావితరాలకు ఆదర్శంగా నిలవాలని భావిస్తున్నారు. పెన్షన్ అనేది ఉద్యోగుల హక్కు. గతంలో ఉద్యోగులకు పెన్షన్ వచ్చేది కాదు. పెన్షన్ అనేది ఉద్యోగుల హక్కు అని సుప్రీంకోర్టు 1982 డిసెంబర్ 17న తీర్పు ఇవ్వడంతో అప్పటి నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ పరిధిలోని ఉ ద్యోగులకు పెన్షన్‌కు చట్టబద్ధత కలిగించాయి. అప్పటినుంచి ఏటా డిసెంబర్ 17న జాతీయ పెన్షనర్స్ దినోత్సవంగా నిర్వహించుకుంటున్నారు.

జిల్లాలో 8 వేల మంది పెన్షనర్లు

జిల్లాలో 8వేల మంది పెన్షన్‌దారులు ఉన్నారు. వీరంతా సామాజిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. హరితహారం, మొక్కల సంరక్షణ, కష్టకాలంలో పేదలకు అండగా ఉంటూ వారికి తోచినంత సహాయం చేస్తున్నారు. వచ్చిన పెన్షన్ మొత్తంలో 10శాతం వరకు పేదలు, ఇతర సామాజిక కార్యక్రమాలకు పంపిణీ చేస్తుంటారు. ఇలా మలి వయస్సులో వారంతా సహాయం చేసుకుంటూ ఉల్లాసంగా గడుపుతున్నారు.

ఆదాయ పన్ను రద్దుకు పోరాటం

ప్రభుత్వం ప్రతినెలా ఇస్తున్న పెన్షన్‌పై ఆదాయప న్ను చెల్లించాల్సి వస్తోంది. దీనిని రద్దు చేయాలని పెన్షనర్లు సుమారు 30 ఏళ్లుగా జిల్లా తెలంగాణ పెన్షనర్స్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నారు. గతంలో పనిచేసిన, ఇప్పుడు పనిచేస్తున్న సీఎంలు, పీఎంలకు పోస్టుకార్డు ఉద్యమం ద్వారా నిరసన తెలుపుతున్నారు.

రాజీలేని పోరాటం



పెన్షనర్ల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్నాం. బీఆర్ఎస్ ప్రభుత్వం మొదట 43శాతం, తర్వాత 30 శాతం పీఆర్సీ ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు 43 శాతం పీఆర్సీ ఇవ్వాలి. నగదు రహిత వైద్యసేవలు కల్పించాలి.

– హరి అశోక్‌కుమార్,పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

రాయితీలు కల్పించాలి



పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవాలి. సీనియర్ సిటిజన్స్, పెన్షనర్లను దృష్టిలో ఉంచుకుని పలు రాయితీలు కల్పించాలి. మాకు ఎలాంటి సౌకర్యాలూ లేవు. ఆర్టీసీ, రైళ్లలో 50 శాతం రాయితీ కల్పించాలి. నగదు రహిత వైద్య సేవలందించాలి.

– గౌరిశెట్టి విశ్వనాథం, కోశాధికారి

గుర్తింపు ఇవ్వాలి



పెన్షనర్లకు సమాజంలో గుర్తింపునివ్వాలి. ప్రభుత్వ కార్యాలయాల్లో, పోలీస్‌స్టేషన్లలో తగిన గౌరవం ఇచ్చి సమస్యలను సత్వరమే పరిష్కరించాలి. మొదటి తేదీనే బ్యాంక్ ఖాతాలో పెన్షన్ వచ్చేలా చూడాలి.

– బొల్లం విజయ్, కార్యదర్శి

క్లుప్తంగా

గ్యాస్ డీలర్ల సమస్యలు పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న జగన్మోహన్ రెడ్డి

జగిత్యాలజోన్: ఎల్‌పీజీ గ్యాస్ డీలర్ల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నామని డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల ఎల్‌పీజీ డీలర్ల సమావేశంలో మాట్లాడారు. డీలర్ల వద్ద పనిచేసే డెలివరీ సిబ్బంది, మెకానిక్‌లు, సిలిండర్లు తనిఖీ చేసే సిబ్బందికి సెట్విన్ సంస్థ ద్వారా శిక్షణ ఇప్పిస్తామన్నారు. ఇందుకు సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. గ్రామీణ యువతకు శిక్షణ ఇప్పించి, ఉపాధి చూపేలా సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. మొబైల్ యాప్ ద్వారా వినియోగదారులు ఈ–కేవైసీ చేసుకోవచ్చని, గ్యాస్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. టీడీఎల్‌ఏ ప్రధాన కార్యదర్శి శ్రీచరణ్ మాట్లాడుతూ.. సివిల్ సప్లై శాఖ ద్వారా ఏటా తీసుకునే లైసెన్స్‌ను జీవితకాల లైసెన్స్‌గా మార్చేందుకు సంఘం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మదన్‌మోహన్, కోశాధికారి ఐలారెడ్డి, రాష్ట్ర బాధ్యులు హరికృష్ణ, నాయుడు, వెంకట్ రెడ్డి, సతీశ్, రవీందర్, రాంరెడ్డి పాల్గొన్నారు.

ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్య

రుద్రంగి(వేములవాడ): రుద్రంగి మండలం అడ్డబోర్‌తండాకు చెందిన వివాహిత లావుడ్య శీల(30) మానసికస్థితి సరిగా లేక శుక్రవారం రాత్రి ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. భర్త లావుడ్య మోహన్ ఉదయం లేచి చూసే సమయానికి బెడ్‌రూమ్‌లోని ఫ్యాన్‌కు ఉరివేసుకొని విగతజీవిగా కనిపించింది. వెంటనే రుద్రంగి పోలీసులకు మోహన్ సమాచారం ఇవ్వగా ఎస్సై రాజేశ్, హెడ్‌కానిస్టేబుల్ బాపురెడ్డి పంచనామా చేసి, పోస్టుమార్టం కోసం సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భర్త మోహన్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మినీస్టేడియంలో వికసిత్ సంకల్ప్‌యాత్ర వీక్షణ

జగిత్యాలటౌన్/ధర్మపురి: కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసేందుకు ఉద్దేశించిన వికసిత్ భారత్ సంకల్ప్‌యాత్ర కార్యక్రమాన్ని శనివారం ప్రధాని మోదీ ప్రారంభించగా.. జగిత్యాల మినీస్టేడియంలో.. ధర్మపురిలోని నందికూడలి వద్ద ఏర్పాటు చేసిన భారీ టీవీ స్క్రీన్స్‌పై బీజేపీ నాయకులు, కార్యకర్తలు లైవ్ ద్వారా వీక్షించారు. కేంద్ర పథకాల లబ్ధిదారులను ఈ సంకల్ప్ యాత్రలో భాగస్వాములను చేయడంతో పాటు అన్ని అర్హతలుండి కూడా పథకాల లబ్ధి పొందని వారి పేర్లు నమోదు చేసేందుకు మినీస్టేడియంలో రిజిస్ట్రేషన్ కౌంటర్ ఏర్పాటు చేసి పేర్లు నమోదు చేశారు.

ఆడారు..అదరగొట్టారు



బహుమతులు అందిస్తున్న అతిథులు



అతిథులకు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

- ముగిసిన రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు
- విజేతలుగా నిలిచిన 17 జట్లు
- బహుమతులు ప్రదానం



విద్యార్థుల యోగా విన్యాసాలు



విద్యార్థుల యోగా విన్యాసాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): చదువుకోవడమే కాదు.. ఆటల్లోనూ సత్తాచాటారు గిరిజన గురుకులం విద్యార్థులు. రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం దుమాల ఏకలవ్య గురుకుల విద్యాలయంలో మూడు రోజులపాటు కొనసాగిన రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు శనివారం ముగిశాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 23 గురుకులం విద్యాలయాలకు చెందిన 800 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. 17 రకాల క్రీడాపోటీలు నిర్వహించారు. గురుకులాల రీజినల్ కో–ఆర్డినేటర్ వెంకన్న, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చిన వారు జాతీయస్థాయిలో ఆడుతారన్నారు. హెచ్‌ఎం ఉపేందర్, భాస్కర్, సతీశ్, ప్రిన్సిపాల్ రామారావు, రోజారాణి, ఎంపీపీ పిల్లి రేణుక, దుమాల సర్పంచ్ కదిరె రజిత తదితరులు పాల్గొన్నారు.

అండర్ –14 విజేతలు వీరు..

కబడ్డీ గూడూరు(ప్రథమ), కొత్తగూడెం(ద్వితీయ), ఖోఖోలో ఇందల్‌వాయి(ప్రథమ), గుండాల(ద్వితీయ), వాలీబాల్‌లో ఎల్లారెడ్డిపేట(ప్రథమ), కురవి(ద్వితీయ), చెస్‌లో బయ్యారం(ప్రథమ), బయ్యారం(ద్వితీయ) స్థానాల్లో నిలిచాయి. అండర్–17.. కబడ్డీలో గుండాల(ప్రథమ), కొత్తగూడెం(ద్వితీయ), ఖోఖోలో ఇందల్‌వాయి(ప్రథమ), కురవి(ద్వితీయ), వాలీబాల్‌లో ఇందల్‌వాయి(ప్రథమ), కురవి(ద్వితీయ), హ్యాండ్‌బాల్‌లో నార్నూర్(ప్రథమ), ఎల్లారెడ్డిపేట(ద్వితీయ), హాకీలో గుండాలపల్లి(ప్రథమ), పాల్వంచ(ద్వితీయ), చెస్‌లో చేరాల(ప్రథమ), ఎల్లారెడ్డిపేట(ద్వితీయ), బాల్ బ్యాడ్మింటన్‌లో గుండాల(ప్రథమ), పాల్వంచ(ద్వితీయ), టెన్నికాయిట్‌లో గుండాల(ప్రథమ), పాల్వంచ (ద్వితీయ) స్థానాల్లో నిలిచాయి.

అండర్–19 విజేతలు.. కబడ్డీలో పాల్వంచ(ప్రథమ), గుండాలపల్లి(ద్వితీయ), ఖోఖోలో గుండాలపల్లి(ప్రథమ), కురవి(ద్వితీయ), వాలీబాల్‌లో ఇందల్‌వాయి(ప్రథమ), కురవి(ద్వితీయ), హ్యాండ్‌బాల్‌లో కురవి(ప్రథమ), గుండాలపల్లి(ద్వితీయ), ఫుట్‌బాల్‌లో కురవి(ప్రథమ), గుండాలపల్లి(ద్వితీయ), బాస్కెట్‌బాల్‌లో ఎల్లారెడ్డిపేట(ప్రథమ), కురవి(ద్వితీయ), హాకీలో గుండాలపల్లి(ప్రథమ), కురవి(ద్వితీయ), చెస్‌లో ఎల్లారెడ్డిపేట(ప్రథమ), పాల్వంచ(ద్వితీయ) స్థానాల్లో నిలిచాయి.

అరుణాచలం తీర్థయాత్రకు ఆర్టీసీ ఆఫర్

- వేములవాడ నుంచి అరుణాచలం ట్రిప్
- రూ.4,500 చార్జీలతో మూడు రోజుల ప్యాకేజీ
- వేములవాడ డీఎం మురళీకృష్ణ

సిరిసిల్లటౌన్: తమిళనాడులోని అరుణాచలం క్షేత్రంలో డిసెంబర్ 26న గిరి ప్రదక్షిణకు ఆర్టీసీ బంపర్ ఆఫర్ ప్రకటించింది. వేములవాడ డిపో నుంచి అరుణాచలం తీర్థయాత్రకు సూపర్‌లగ్జరీ బస్సును నడుపుతున్నట్లు డిపో మేనేజర్ మురళీకృష్ణ శనివారం తెలిపారు. ఈనెల 24వ తేదీ రాత్రి 8 గంటలకు బయలుదేరి కరీంనగర్ మీదుగా, ఆంధ్రప్రదేశ్‌లోని కాణిపాకం, వెల్లూరు క్షేత్రాలను సందర్శిస్తూ 25వ తేదీ రాత్రి 8 గంటలకు అరుణాచలం చేరుకుంటుందని తెలిపారు. తిరుగుప్రయాణం 27వ తేదీ సాయంత్రం 5గంటలకు ప్రారంభమై 28న జోగులాంబ క్షేత్రం చేరుకుంటుందని అదే రోజు సాయంత్రం రాత్రి వరకు వేములవాడకు చేరుకుంటుందని తెలిపారు. పెద్దలకు ఒక్కొక్కరికి రూ.4,500, పిల్లలకు రూ.3,400 టిక్కెట్ ధర ఉంటుందన్నారు. వివరాలకు 73828 51826లో సంప్రదించాలని కోరారు.

‘వాగేశ్వరి’లో ముగిసిన వర్క్‌షాప్



మాట్లాడుతున్న ట్రైనర్ సిరిచందన

తిమ్మాపూర్(మానకొండూర్): మండలంలోని రామకృష్ణకాలనీ వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజులుగా టాస్క్, ఫ్రంట్ ఎండ్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ సీఎస్‌ఈ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన వర్క్‌షాప్ శనివారం ముగిసింది. కళాశాల చైర్మన్ జి.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. వర్క్‌షాప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. టాస్క్ ట్రైనర్ సిరిచందన మాట్లాడుతూ.. ఫ్రంట్ ఎండ్ టెక్నాలజీస్‌ను వాడుకొని, వెబ్‌సైట్ రూపొందించాలన్నారు. భవిష్యత్‌లో వెబ్ డిజైనర్లుగా స్థిరపడేందుకు ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులు తమ అకాడమిక్స్‌తోపాటు ఇలాంటి వర్క్‌షాప్స్‌లో పాల్గొనడం ద్వారా కొత్త టెక్నాలజీపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీఎస్‌ఈ విభాగాధిపతి డాక్టర్ చంద్రమౌళి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నాలుగు ఇళ్లల్లో చోరీ

- నాలుగు తులాల బంగారం, రెండు కిలోల వెండి అపహరణ



వివరాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

మల్లాపూర్: మండల కేంద్రంలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు నాలుగిళ్లల్లో చోరీకి పాల్పడ్డారు. నాలుగుతులాల బంగారం, రెండు కిలోల వెండిని దొంగిలించారు. బాధితులు, మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై నవీన్‌కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బురం అరవింద్, మాతే విమల, రమ్యశ్రీ, చింతకుంట రేవతి ఇళ్లకు తాళం వేసి వెళ్లారు. గుర్తు తెలియని దుండగులు వారి ఇళ్లలో చోరబడ్డారు. బాధిత కుటుంబాలు ఉదయం వచ్చి చూసే సరికి వస్తువులు, బట్టలు చిందరవందరగా పడి ఉన్నాయి. ఆభరణాలు, వెండి వస్తువులు కనిపించకపోవడంతో దొంగతనం జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ, ఎస్సై పోలీస్ సిబ్బందితో క్లూస్‌టీంతో వచ్చి విచారణ చేపట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేయనున్నట్లు సీఐ తెలిపారు.

ఔట్ సోర్సింగ్ పోస్టుల మెరిట్ జాబితా

సిరిసిల్ల: జిల్లా పౌర సంబంధాల అధికారి ఆఫీస్‌లో ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని భర్తీ చేసే మెరిట్ జా బితాను వెల్లడించినట్లు డీపీఆర్వో మామిండ్ల దశరథం శనివారం ప్రకటించారు. వచ్చిన దరఖాస్తుల్లో అర్హులైన అభ్యర్థుల మెరిట్ జాబితిలో ఏపీఆర్వోకు ఐదుగురు, పబ్లిసిటీ అసిస్టెంట్(ఫొటోగ్రాఫర్) ముగ్గురు అర్హత సాధించారని వివరించారు. మరో పబ్లి సిటీ అసిస్టెంట్(వీడియోగ్రాఫర్)కు రెండు దరఖా స్తులు రాగా.. విద్య అర్హతలు లేవని దశరథం తెలిపారు. ఒక ఆఫీస్ సబార్డినేట్ పోస్టుకు సంబంధించి ఎంపానల్డ్ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ నుంచి అభ్యర్థిని ఇవ్వవలసిందిగా సూచించినట్లు తెలిపారు. జాబితాపై అభ్యంతరాలు ఉంటే 18వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా డీపీఆర్వో ఆఫీస్‌లో తెలియజేయాలని కోరారు. కలెక్టర్ ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారని తెలిపారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

సిరిసిల్లక్రైం: ప్రమాదవశాత్తు ఉడికిన పప్పులో పడి గాయపడిన ఆరేళ్ల బాలుడు చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. సిరిసిల్ల ఎస్సై శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాలు. ఎల్లారెడ్డిపేట మండలం గుండారం గ్రామానికి చెందిన రజిత సిరిసిల్లలోని జ్యోతిరావుపూలే బాలికల వసతిగృహంలో వంట మనిషిగా పనిచేస్తుంది. రోజువారీగా వంట చేయడానికి వచ్చే సమయంలో గత నెల 11న ఆమె ఆరేళ్ల కుమారుడు వర్షిత్ వెంట వచ్చాడు. ప్రమాదవశాత్తు ఉడికిన పప్పులో పడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ బాలుడిని చికిత్స కోసం సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ వర్షిత్ వరంగల్‌లో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. వంటల కాంట్రాక్టర్ రవిపై మృతుడి తండ్రి సురేష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో రైతు..



మల్లేశం (ఫైల్)

జగిత్యాలక్రైం: జగిత్యాలరూరల్ మండలం గుట్రాజ్‌పల్లికి చెందిన రైతు జుర్రు మల్లేశం (55) శనివారం విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు. మల్లేశం శనివారం తన వ్యవసాయ పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లగా మోటార్ నుంచి వచ్చే విద్యుత్ వైర్లు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు అతడిని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య స్వప్న, నలుగురు కూతుళ్లు ఉన్నారు. నిత్యం అందరితో కలిసిమెలిసి ఉండే మల్లేశం విద్యుత్‌షాక్‌తో మృతిచెందడం, ఆయనకు నలుగురు కూతుళ్లు ఉండడంతో గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి..

మల్యాల: ఆర్థిక ఇబ్బందులతో ఈనెల 3న క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మల్యాల మండలం ముత్యంపేటకు చెందిన ఒల్లాల నవీన్ గౌడ్ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య దివ్య, ఇద్దరు కూతుళ్లు నైనిక, వశిష్ట ఉన్నారు. సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, గౌడ సంఘ నాయకులు, స్థానికులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు.

బైక్‌ను ఢీకొన్న కారు

- వ్యక్తికి తీవ్ర గాయాలు

మానకొండూర్: మండల కేంద్రంలోని కరీంనగర్–వరంగల్ ప్రధాన రహదారిపై బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మానకొండూర్ మండలంలోని గంగిపల్లికి చెందిన ముక్కల సుధాకర్ పని నిమిత్తం శనివారం తన బైక్‌పై కరీంనగర్ వెళ్తున్నాడు. మండల కేంద్రంలోని వాటర్ ట్యాంక్ సమీపంలో వెనక నుంచి అతివేగంగా వచ్చిన గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుధాకర్ తీవ్రంగా గాయపడ్డాడు. అతని పరిస్థితి విషమంగా ఉండటంతో స్థానికులు హుటాహుటిన కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.





అంజన్న సన్నిధిలో భక్తుల రద్దీ

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయం భక్తులతో శనివారం కిక్కిరిసిపోయింది. సుమారు 10వేలకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తుల ఏర్పాట్లను ఈవో టి.వెంకటేశ్, ఏఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ శ్రీనివాస శర్మ, సునీల్ పర్యవేక్షించారు.

బీఆర్‌ఎస్ అవినీతిపై పోరాడండి



- వచ్చే నెల కరీంనగర్‌లో ఆత్మీయ సమ్మేళనం
- ఎంపీ బండి సంజయ్
- బీజేపీ పదాధికారులతో సమావేశం

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ కార్పొరేషన్ సహా పార్లమెంట్ పరిధిలోని చొప్పదండి, సిరిసిల్ల, వేములవాడ తదితర మున్సిపాలిటీలు, స్థానిక సంస్థల్లో బీఆర్‌ఎస్ అవినీతి, అక్రమాలపై పోరాడాలని ఎంపీ బండి సంజయ్ పిలుపునిచ్చారు. శనివారం కరీంనగర్‌లోని ఈఎన్ గార్డెన్స్‌లో పార్లమెంటరీ నియోజకవర్గ పదాధికారులతో ఆయన సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో అవినీతికి అంతులేకుండా పోయిందని, శ్మశానవాటికలో యంత్రాల ద్వారా గడ్డి పీకామని చెప్పి, దొంగ బిల్లులు పెట్టి రూ.12 లక్షలు దోచుకున్నారని అన్నారు. బిల్లులో ఓ వాహనం నంబర్ రాస్తే.. దానిపై ఆరా తీయగా అది బైక్ అని తేలిందని తెలిపారు. వాళ్ల అవినీతికి ఇదో మచ్చు తునక అన్నారు. రెండు, మూడు రోజుల్లో కరీంనగర్ కార్పొరేషన్‌లో మేయర్ సహా బీఆర్‌ఎస్ కార్పొరేటర్ల అవినీతి, అక్రమాలపై పూర్తి వివరాలు తెప్పించుకోవాలని, పోరాటాలతో వారికి ముచ్చెమటలు పట్టించాలని సూచించారు.

కొండగట్టుకు నిధులేమయ్యాయి?

కొండగట్టు ఆలయానికి ఇస్తానన్న నిధులేమయ్యాయో తేల్చేవరకు పోరాడాలని ఎంపీ సంజయ్ అన్నారు. ఈ విషయంలో కేసీఆర్, కవిత క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేయాలన్నారు. ప్రజలను దోచుకుతిన్న బీఆర్‌ఎస్‌ను పూర్తిగా తరిమికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ కొత్తగా అధికారంలోకి వచ్చిందని, హామీలు అమలు చేయడానికి కొంత సమయం ఇద్దామని చెప్పారు. బెజ్జంకిని కరీంనగర్‌లో కలపాలన్నది ప్రజల డిమాండ్ అని, దీనికోసం బీజేపీ కార్యకర్తలంతా రోడ్డెక్కాలని కోరారు.

కలిసికట్టుగా ముందుకుసాగాలి

అంతర్గత విభేదాలను పక్కనపెట్టి, కలిసికట్టుగా ముందుకుసాగాలని ఎంపీ అన్నారు. ప్రతీ కార్యకర్త ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొని, ఇంటింటికీ తిరిగి కొత్త ఓటర్లను చేర్పించాలని సూచించారు. వచ్చే నెల తొలి వారంలో పార్లమెంట్ నియోజకవర్గ స్థాయిలో కార్యకర్తలతో కరీంనగర్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తామని పేర్కొన్నారు. వికసిత భారత్ సంకల్ప యాత్రలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.



వాకింగ్ చేసేందుకు..



వీధులను శుభ్రం చేస్తూ..



పేపర్లు సెట్ చేసుకుంటున్న బాయ్స్

చలిలోనూ ఆగని పయనం

రాయికల్: జగిత్యాల జిల్లాలో ఐదురోజులుగా చలిపంజా విసురుతోంది. చలిని సైతం లెక్కచేయకుండా సామాన్యులు తమ దినచర్యను చేపడుతున్నారు. చలిని జయిస్తూ సామాన్యులు చేస్తున్న పనులపై ‘సాక్షి’ తన కెమెరాలో బంధించింది.





చలిమంట కాగుతూ..



టీ తాగి పనికెళ్దాం...

జీఎస్టీ నకిలీ బిల్లుల్లో ఉద్యోగి పాత్ర?

- మెయిల్ ఐడీ, ఫోన్‌నంబర్లు మార్చిన ఉద్యోగి
- హైదరాబాద్‌లో విచారణకు హాజరు


జగిత్యాలక్రైం: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన జీఎస్టీ నకిలీ బిల్లుల వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. ఇందులో ఇంటిదొంగనే సూత్రధారి అని విచారణలో వెల్లడైంది. జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి గ్రామానికి చెందిన చంద సాయి వాణిజ్య పన్నుల శాఖలో పనిచేస్తున్న ఓ ఉద్యోగితో చేతులు కలిపి ప్రభుత్వానికి సుమారు రూ.283 కోట్ల జీఎస్టీ ఎగవేతకు పథకం పన్నారు. జగిత్యాల వాణిజ్య పన్నుల శాఖలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి సాయితో చేతులు కలిపి జీఎస్టీ నంబరు ఉన్న వారి మెయిల్‌ఐడీ మార్పుతోపాటు, వారి ఫోన్ నంబర్లు మార్చి ఈ వ్యవహారం నడిపినట్లు వెల్లడైంది. దీంతో వాణిజ్య పన్నుల శాఖ అధికారులు గురువారం విచారణకు వస్తున్నారని తెలిసి సదరు ఉద్యోగి సెలవులో వెళ్లినట్లు గుర్తించారు. శుక్రవారం హైదరాబాద్‌లో సాయిని విచారించగా సదరు ఉద్యోగి పేరు వెల్లడించారని, ఆయనను శనివారం హైదరాబాద్‌కు పిలిపించి పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నారని తెల్సింది. వ్యవహారం వెనుక ఎంత మంది ఉన్నారు..? అనే కోణంతోపాటు.. ఎంత మేర అవినీతి జరిగిందనే కోణంలో వాణిజ్య పన్నుల శాఖ అధికారులు లోతైన విచారణ చేపడుతున్నారు. పలు సాక్ష్యాధారాలు సేకరిస్తున్నారు.

ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేయించిన వారిపై కేసు


జగిత్యాలక్రైం: జగిత్యాలరూరల్ మండలం నర్సింగాపూర్ శివారు సర్వేనంబరు 437లోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకునేలా ప్రోత్సహించిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు. ప్రభుత్వ భూమిలో నెలరోజులుగా సుమారు 800 మంది వివిధ జిల్లాల్లోని గ్రామాల నుంచి ప్రజలను మభ్యపెట్టి తీసుకొచ్చి ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని చెప్పి అక్రమంగా గుడిసెలు వేయించిన సీపీఎం ఎన్జీవో నాయకుడు గర్వందుల రమేశ్, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎల్లెల బాలకృష్ణ, సీఐటీయూ నాయకురాలు ఇందూరు సులోచన, సీపీఎం నాయకులు కుంచెపు శంకర్, సీపీఐ జిల్లా కార్యదర్శి యాళ్ల అరుణ్, సీపీఎం జిల్లా కార్యదర్శి గుగ్లోతు తిరుపతినాయక్, కడకుంట్ల నాగరాజుపై రూరల్ తహసీల్దార్ రాంమోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నర్సింగాపూర్ గ్రామ రెవెన్యూ శివారులో 437లో ఉన్న ప్రభుత్వ భూమిని గతంలో వివిధ శాఖలకు కేటాయించారు. అందులో ఇటీవల కొంతమంది అక్రమంగా ప్రవేశించి ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా తాత్కాలికంగా గుడిసెలు నిర్మించేందుకు వీరు ప్రోత్సహించినందుకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

దైవ దర్శనానికి వెళ్తూ.. మృత్యు ఒడికి

- కారును లారీ ఢీకొని బావ, బావమరిది దుర్మరణం
- మరొకరికి తీవ్ర గాయాలు
- శంకరపట్నం మండలం తాడికల్ శివారులో ఘటన



శ్రావణ్ (ఫైల్)



ఆకాశ్ (ఫైల్)

శంకరపట్నం(మానకొండూర్): దైవ దర్శనానికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో బావ, బావమరిది మృత్యు ఒడికి చేరారు. ఈ ఘటనలో మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని టేకుమట్ల మండలం పెద్దపల్లి గ్రామానికి చెందిన బొల్లకొండ ఆకాశ్(22), ఏంపేడు గ్రామానికి చెందిన మాడగోడి శ్రావణ్(30) బావ, బావమరిది. ఈ ఇద్దరు, ఆకాశ్ స్నేహితుడు రాకేశ్ శుక్రవారం అర్ధరాత్రి దాటాక కారులో వేములవాడ రాజరాజేశ్వరస్వామి దర్శనానికి బయలుదేరారు. శంకరపట్నం మండలంలోని తాడికల్ శివారులోకి రాగానే ఎదురుగా కరీంనగర్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆకాశ్, శ్రావణ్ అక్కడికక్కడే మృతిచెందారు. రాకేశ్‌కు తీవ్ర గాయాలవడంతో స్థానికులు 108 వాహనంలో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. హుజూరాబాద్ రూరల్ సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై లక్ష్మారెడ్డి ఘటనాస్థలికి చేరుకొని, పరిశీలించారు. ఆకాశ్ తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.